పి.వి.బి. శ్రీరామమూర్తి

# న్యాయం కోసం.....



"ఇంతకీ ఈ విషయంలో నీ ఉద్దేశమేంటి?" అడిగాడు దినకర్.

"తక్షణం దీని గురించి మనం సీరియస్‌గా ఆలోచించాలి" అన్నాడు కిరణ్.

"అదే సరే. ఇంతకీ దినమణిగారెలా ఊరుకున్నారు?"

"ఇది ఆయనొక్కరివల్లనే కావాల్సిన పని కాదు. పైగా ఈ వ్యవహారంలో చాలా పెద్ద మనుషుల ప్రమేయం, ప్రచ్ఛన్న హస్తం ఉంది" అన్నాడు కిరణ్.

"మరి అలాటి వ్యక్తులకే న్యాయం జరగనపుడు సామాన్యుల మాటేమిటి?"

"సామాన్యులైతే ఇంతవరకూ రానేరాదు. ఇంత వరకూ వచ్చింది కాబట్టి వాళ్ళకు బోల్డు సొమ్ము ఖర్చయింది. పైగా వీళ్ళకి రూలింగ్ గవర్నమెంట్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. అపోజిషన్ వాళ్ళతో చుట్టరికాలున్నాయి" అన్నాడు.

"సరే ఇవాళ నల్లకోటు ధరించిన వాళ్ళు నల్లధనాన్ని జేబులు నిండా నింపుకోటానికే చూస్తున్నారు తప్పా, ఆకోటు వేసుకునే ముందు చేసిన ప్రమాణాలు వారు గుర్తు తెచ్చుకోవటం లేదు. అందునుంచి మన లా విద్యార్థులు నడుంకట్టి ఇలాటి వాటినెదిరించకపోతే రానున్న రోజుల్లో 'న్యాయం' అన్న పదమే డిక్షనరీలో కనబడకుండా పోయే ప్రమాదముంది" అన్నాడు కిరణ్.

ఆ సాయంకాలం ఆ నగరంలో సుమారు పాతిక మంది లా విద్యార్థులు న్యాయం కోసం నడుంబిగించటానికి ముందుకొచ్చారు. వాళ్ళని తాకితే పౌరషం బుసలు కొడుతుంది. ఒక్కొక్కరూ బోసూ, సీతారామరాజు, భగత్‌సింగుల్లా కనిపించారు. వారికి ప్రముఖ న్యాయవాది దినమణి తాత్కాలిక సలహాదారుగా ఉన్నారు.

"దినమణిగారూ! మీరు ముందుకు రండి. మేం ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధం" అన్నారు పిల్లలు.

"అది కాదండీ. ఇంతకీ ఆ డాక్టరమ్మది హత్యా? ఆత్మహత్యా?"

''పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం ఆత్మహత్యే!''

''అంటే?''

''బాహాటంగా కనిపిస్తోన్న నిజం 'తెస్తానన్న కట్నం డబ్బులు' తేలేదని సినిమా ఫక్కీలో చంపబడ్డది. దానికి ప్రత్యక్ష సాక్షులున్నారు. ఈ డాక్టరమ్మా, ఆ డాక్టరూ రోజూ గొడవలు పడేవారట. మొదట్లో ఈ డాక్టరమ్మ అతన్ని ప్రేమించింది. కానీ వీళ్ళడిగిన కట్నం ఇచ్చుకోలేకపోయారు. లక్షల కట్నంతో మరో డాక్టరమ్మ 'సమ్మంధం' వస్తే ఈయన మొగ్గు చూపాడు. కానీ కొన్ని డైరీలు, లేఖలు తో ఈ డాక్టరమ్మ అతన్ని సొంతం చేసుకుంది. అతని మనస్సు మాత్రం కాదు. అక్కణ్ణించి వేధింపులు సాధింపులు! ఫలితంగా ఆమె మరణం.''

''మరి పోస్టుమార్టం రిపోర్టు ఆ డాక్టరెలా ఇచ్చారు? తోటి డాక్టరన్న సానుభూతి లేకుండా!''

''డబ్బు దగ్గర సానుభూతి, చట్టబండలు ఎవరిక్కావాలి? నా బొంద!'' అన్నారు దినమణిగారు,

''సరే ఇప్పుడు మనం చేయాల్సిందేమిటి?''

''కొన్ని సాధించాలంటే డబ్బు చాలా అవసరం. కానీ డబ్బే అన్నిటినీ సాధించలేదు. దీనికి ప్రతిఘటన కావాలి! చైతన్యం రావాలి! అన్యాయం మీద తిరుగుబాటు చేయగల 'యువశక్తి' ముందుకు రావాలి!''

''సర్టెన్లీ. వేం మా ప్రాణాలైనా అర్పిస్తాం.''

''వద్దు. మీరంతా ఒకటి కావాలి. ఒక ఎజెండా తయారుచేసుకోవాలి. అన్యాయం వైపు వాదించే వాళ్ళని నిలదీయాలి. మీ పిల్లలంతా ముందుకు రావాలి.''

''సరే. మీరేవ మాకు నాయకత్వం వహించాలి''

''నాయకత్వం సమస్య కారాదు. రేపు ఇంకా తక్కిన వాళ్ళని సిద్ధం చేయండి'' అన్నాడు దినమణిగారు.

అలా నాటి సమావేశం ముగిసింది!

ఆ మర్నాడు దినమణిగారి నేతృత్వంలో సమావేశం జరిగింది.

ముందు దినమణిగారినే 'న్యాయపోరాట సమితి'కి చైర్మన్‌గా చేయాలనుకున్నారు. యువకుల్లో కొందరు ఆయన్ను సలహాదారునిగా ఉంచితేనే మంచిది అన్నారు. ఆయనా కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందుల దృష్ట్యా అలాగేనన్నారు. అందరిలోనూ ఘటికుడూ, గొప్ప చురుకైనవాడు మార్కండేయులు. అతన్ని చైర్మన్ చేయాలని అనుకున్నారు. ఇంచుమించు పేరు ఖరారౌతున్న దశలో సూర్యారావు చిన్న సమస్య లేవనెత్తాడు. మార్కండేయులు ఫైనలియర్ విద్యార్థి. అతను రేపోనేడో ఎగ్జామ్స్ వ్రాస్తే నల్లకోటు తొడుగుతాడు. వాళ్ళూరు పోతాడు. అందునుంచి కొన్నాళ్ళుండే మనిషిని ఎన్నుకోవడం మంచిది అన్నాడు. ఆ విషయం తర్జనబర్జనలు జరిగి, మార్కండేయులు పేరు వెనకపడ్డది. సూర్యారావు పాచిక అదికాదు. మార్కండేయులు కులం బలం లేనివాడు. అతడొక్కడే ఒక కులం. పోనీ 'డేవిడ్ రాజు?' అన్నారు కొందరు.

''డేవిడ్ రాజు కంటే శర్మ అయితే బాగుంటుంది''

''శర్మ మెతక. ఇబ్రహీం చురుకైనవాడు!''

అప్పుడు సూర్యారావు భగ్గున లేచాడు. ''అయితే శర్మా, లేకపోతే డేవిడ్, ఇబ్రహీం

వీళ్ళేనా? ముచ్చికాయ ముగ్గురు ఒంటరితాటి చెట్లలాగ! రేపు దేనికైనా దన్నుకావాలంటే వీళ్లెంత మంది జనాన్ని తేగలరు? వీళ్ళకున్న బలమెంత! దాని గురించి ఆలోచించరేం? ఒక పనిచేసే ముందు ప్రజ్ఞ ఒక్కటే చాలదు రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ప్రధాని ఎందుక్కాలేదు? చెప్పండి? దేనికైనా వెనుక మద్దత్తునీ లెక్కలోకి తీసుకోవాలి?''

అతని మాటలకి దినమణిగారు నవ్వుకున్నారు.

అతనికి పరిస్థితి అర్థమైంది.

''పోనీ 'సుబ్రావు'ని ప్రపోజ్ చేస్తే?'' అన్నారు.

''గురూగారూ! నామీదంత భారం పెట్టకండి. నాకా కాంక్ష లేదు'' అన్నాడు. అనేసి ''మీరు తప్పదంటే నాకభ్యంతరం లేదు'' అన్నాడు ముసిముసిగా.

శర్మకి ఒళ్ళు మండింది.

''రవి అయితే ఇంకా సమర్థుడు. అరడుగుల మనిషి, ప్రకాశం పంతులు గారిలా బోర విరుచుకుని జనంలోకి వెళ్ళగలడు!'' అన్నాడు.

ఆ తరువాత సూబ్రావుకీ రవికీ నాయకత్వం పోటీ ఏర్పడింది.

నిర్ణయం మర్నాటికి వాయిదాపడింది.

ఎన్నిక పోటీ తప్పని సరైంది.

ఎన్నికల్లో రవి గెలిచే సూచనలు దండిగా కనిపిస్తోన్న తరుణంలో సూబ్రావు విజృంభించాడు. ఒరిస్సానించి సరుకు తెప్పించాడు. విలాసం, విందూ పసందుగా ఏర్పాటు చేశాడు. ఇంటి నుండి దండిగా సొమ్ము తెప్పించాడు.

రవి గెలిచి తీరతాడనుకున్నారందరూ!

కానీ డాక్టరమ్మలాటి అదృష్టవంతులకూ, మధ్య తరగతికీ, బలహీనులకు, బడుగు జనాలకీ న్యాయం జరగాలనుకుని ఏర్పాటు చేయగలచిన న్యాయపోరాట సమితి చైర్మన్ ఎన్నికల్లో సూబ్రావు గెలిచాడు!'' రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ మద్దత్తుతో

(కథ కేవలం కల్పితం)